



ఈవేళ సూర్యుడు చాలా చల్లగా వున్నాడు. ఈ మిట్టమధ్యాహ్నం- మండువేసంగి సూర్యుడు చల్లగా వుండడానికి కారణం లేక పోలేదు. ఎన్నాళ్లనుంచో ఎదురు చూస్తున్న జీతండబ్బులు ఈ వేళ చేతిలో పడ్డంవల్ల ఎండకూడా చల్లగా, కమ్మగా వుంది-మజ్జిగలా!

తెగిపోయిన కాలిచెప్పుని లెక్క చేయకుండా మరుగ్గా నడుస్తున్నాను. నా మనసులో రకరకాల చీరలు—కొత్త కొత్త పరిమళాలతో గుట్టలు గుట్టలుగా కనిపిస్తున్నాయి. వాటిమధ్య నా శ్రీమతి......

ఆవేళ పదిహేనో తారీకు. ఉదయం నేను లేచేసరికే తలారా స్నానంచేసిన శాంత కాఫీ కలుపుతూ దర్శనమిచ్చింది.

"ఏమిటి విశేషం ఈవేళ తలంటుకున్నావ్?" అని అడిగాను.

"ఈవేళే నేను పుట్టానోచ్! నన్ను పలకరించకండి, నాకుమాటలురావుగా" అంది శాంత మల్లెపువ్వులా నవ్వుతూ.

"అరె! పుట్టిన్రోజా! మరి ముందుగా చెప్పావుకాదేం?"

"ఏం—చెబితే కొత్తచీర కొనిచ్చేవారా?"

నా మనస్సు ఒక్కక్షణం మూగబోయింది. దీర్ఘంగా ఆమెవైపు చూశాను. ఆమె శరీరంమీద వెలిసిపోయిన పాతచీర ఎడారి పొరలా పరుచుకుంది. అదిరెండేళ్ళ క్రితం కొన్న చీర. మళ్ళీ ఈనాటివరకూ ఒక్క చీరకూడా కొనలేకపోయాను. ఎర్రచీమలాంటి జీతం, ఎలుగుబంట్లవంటి ఖర్చులు!...

"చీరగురించి ఆలోచన తరవాతగానీ—కాఫీ తీసుకోండి" అంటూ గ్లాసు అందించింది శాంత.

అప్పటికే ఓ నిర్ణయానికి వచ్చాను.

"శాంతా! ఒకటో తారీకున తప్పకుండా నీకు చీర కొనిపెడతాను" అన్నాను దీక్షగా ఆమె కళ్ళలోకి చూస్తూ.

"ఏమిటండోయ్! ఇది మరీ బావుంది. ఈవేళ పుట్టిన్రోజేమిటి—ఒకటో తారీకున చీర కొండమేమిటి! ఇదేదో కొత్త రకం ఖాతాలావుందే!" అంది శాంత. కేవలం హాస్యానికే అన్నప్పటికీ—నా గుండె చివుక్కుమంది.

"శాంతా—నా జీవితం అంతా నీకు తెలుసు. ఈవేళే కొనగలిగితే ఇంతసేపు ఊరుకునేవాణ్ణా! ఆ బట్టలకొట్టువాళ్లు మనలాంటి వాళ్ళకు అరువివ్వరు. ఈనెల మధ్యలో అప్పిచ్చే మిత్రుడుకూడా లేడు" అన్నాను. చిన్నగా నిట్టూర్చాను.

"వట్టినే అన్నానండీ—నాకిప్పుడు చీరలెందుకు. ఉన్నబట్టలు చాలవా యేమిటి! సాయంత్రం వచ్చేప్పుడు మల్లెపూలు మాత్రం తెచ్చిపెట్టండి."

నన్నర్ధం చేసుకుంది కనక కోరికల్ని దిగమింగడం నేర్చుకుంది శాంత.

"అలాకాదు—ఒకటో తారీకున చీర కొనడం ఖాయం" అన్నాను దృఢంగా.

శాంత నవ్వింది.

"ఇలాంటి వాగ్దానాలుమాత్రం చెయ్యకండి. వాగ్దానాలంటే—దొరకని పొగలాంటివి—కాదు కాదు అగరత్తుల పొగలాంటివి. పైగా—చేసిన వాగ్దానాలుమళ్ళీ మళ్ళీ గుర్తుతెచ్చుకోనక్కరలేదనేభావం మన పెద్దల్లో బలిసిపోవడంచేత—జనంలో వాగ్దానాలంటే లోకువ పెరిగిపోయింది!" అంటూ ఓ అరగంట ఉపన్యాసం చెప్పింది శాంత.

శాంత, చిన్నప్పటినించీ చాలాపుస్తకాలు చదివింది. ఇప్పుడుకూడా పత్రికలు పుస్తకాలు ఎవరింట్లోనుంచయినా తెచ్చు

కని చదువుతూనే వుంటుంది. ఏడాదినించి కథలు, వ్యాసాలు రాస్తూందికూడా! ఓ వంద రచనలు చేసినతరువాత ఒక్కొక్కటి పత్రికలకి పంపించాలని ఆమెఅభిప్రాయం. ఖర్మంచాలక ఆమెతో వాదించానంటే ఓ డజనుమంది కవుల్నీ పాతికమంది రచయితల్నీ తన వాదానికి సాక్ష్యాలుగా, ఆధారాలుగా తీసుకొస్తుంది. అయితే ఇలాంటి భేదాభిప్రాయాలేవీ మా అన్యోన్యతకి, అనురాగానికీ ఆటంకాలుమాత్రం కావు.

ఏమైతేనేం___చీర కొంటాననిశపథం చేశాను కనక డబ్బు అవసరం, ఆతృత రెట్టింపు పెరిగాయి.

ఇన్నాళ్ళూ వెయ్యిగుండెలతో ఎదురుచూస్తూ గడిపి, ఈవేళ జీతం తీసుకున్నాను. మధ్యాహ్నం అతి కష్టంమీద ఆఫీసులో సెలవు సంపాదించాను. సరదాగా కుటుంబ సమేతంగా షికారు, సినిమా వగైరాలన్నీ అనుభవాల పేటికలో దాచుకోవాలని తీర్మానించుకున్నాను. ఈవేళ పండుగ చేసుకుంటాను.

చల్లటి ఎండలో కమ్మగా నడుస్తున్నాను.

బస్ హారన్ బయ్యిమంది. ఆలోచనల గదుల పెట్టిలోంచి బయటపడి చుట్టూ చూశాను. షోకేసుల్లో చీరలు కట్టుకున్న బొమ్మలతో, వేలాడే చీరలతో, అటుయిటు కదిలే మనుషులతో బట్టలకొట్లు నిండుగా నవ్వుతున్నాయి. ఈ రంగుల్నీ ఈ నవ్వుల్నీ చూస్తే శాంత ఏ ఉపమానం చెబుతుంది చెప్మా...? అని ఆలోచన కలిగింది. 'ఈ బజారు___రకరకాల రంగుసరుకులతో వేగుతున్న పోపులావుంది!' అంటుందేమో! సాధారణంగా శాంత ఉపమానాలన్నీ యిలాగే వంటింటి పరంగా ఉంటాయి. రోజూ వింటూండడంచేత నాకుకూడా వాటిలో కొన్ని అప్రయత్నంగా దొర్లిపోతూ ఉంటాయి.

దుకాణాల వెంపు చూస్తూ కాస్సేపు నిలబడ్డాను. తరుచు వెళ్ళేవాడిని కాకపోవడంవల్ల అవన్నీ నాకు కొత్తే! ఎదురుగా ఉన్న ఓ కొట్లో ప్రవేశించాను.

“రండి_రండి” అంటూ వినయంగా ఆహ్వానించాడు యజమాని_ఎంతవొల్చినా ఊరే నీరుల్లిపాయి పొరల్లాంటి చిర్నవ్వులతో!

కొట్లో చాలామంది జనం ఉన్నారు. ఓ పనికుర్రాణ్ణి పిలిచి చీరలు చూపించమన్నాను.


“ఏరకం సార్? బనారసా, కంచా, ఉప్పాడా, పెద్దాపురవా, నైలెక్సా_రూబీ, టెర్లిన్, పద్మ, జయంతి, సావిత్రి...” అంటూ ఓ పెద్ద దండకం చదివాడు కుర్రాడు. ఎప్పుడూ ఆ పేర్లేనా వినలేదు నేను.

“అవేవీ వద్దుగాని పువ్వుల వాయిల్ చీరలు చూపించు” అన్నాను.

అయిదు నిముషాల్లో ఓ గుట్ట నాముందు పడింది. అటూ ఇటూతిప్పి అన్నీ చూశాను ఒక్కటీ నచ్చలేదు.

“వాయిల్స్‌లో, బంతిపువ్వురంగు పువ్వుల చీరల్లేవూ?” అని అడిగాను.

“ఉప్పాడ బూటాలో ఉన్నాయి సార్_డెభ్భై ఎనభై రూపాయల్లో_చూపించమంటారా?”




సరే!! ఆ చీరకొంటే ఈ నెలంతా
ఆ చీరనే చూస్తూ కడుపు నింపుకోవాలి!

"మళ్ళీ వస్తా" అంటూ కొట్టుదిగాను.

మరోకొట్టు—ఇంకోషాపు—అన్నీ వెతుకు
తున్నాను. ముత్తం పాతిక కొట్లయినా
వెతికేసివుంటాను. బంతి పువ్వు రంగు
పువ్వుల వాయిల్ చీర ఎక్కడా లేదు.

రంగుంటే పువ్వుల్లేవు. పువ్వులుంటే
రంగులేదు. ఎన్ని షాపులని తిరగను! నీరసం
గా ఉంది. విసుగ్గా వుంది! తక్కువ
ఖరీదులలో అందమైన చీర— అందులోనూ
నాంతకి నచ్చే రంగులో కావాలంటే
అసాధ్యంలా కనబడుతూంది. చీర
కొనడం పెద్ద సమస్యలా తయారైంది!
దండీగా డబ్బుంటే ఏ సమస్యా లేదేమో!
ఇంక ఆఖరుసారిగా ఓ కొట్టుచూసి
ఏదో ఒకటి కొనుక్కుపోవాలి.' అను
కుంటూ ఓ చిన్నకొట్లోకి అడుగుపెట్టాను.

నా అదృష్టమో ఏమో — ఆ కొట్లో
నా కోర్కెలన్నిటికీ తగిన చీర ఠక్కున
దొరికింది. చాలా అందంగా వుంది.

"తీసుకోండి సార్ చాలా బాగా
మన్నుతుంది. ముప్ఫయ్ రూపాయలు."
అన్నాడు షాపు యజమాని.

"అమ్మ బాబోయ్! అంత ఖరీదే!"
అప్రయత్నంగా అన్నాను.

"అదేమిటి సార్ ముప్ఫయ్యేగా!"
అని ఒకక్షణం ఏదో ఆలోచించాడు.
వేళ్ళతో గాలిలో ఏవో లెక్కలు
వేశాడు. "ఉ— సరేసార్— ఇరవై
ఎనిమిన్నరివ్వండి. మీకన్నా కన్సెషన్."
అంటూ చీర పాక్ చెయ్యసాగాడు.

"అచ్చే—అదేం లేదు. ఆ అర్ధరూపాయి
కూడా తీసెయ్యండి." అన్నాను ఏదో

తెలివిగా బేరం చేస్తున్నట్టు!

"బలేవారే సార్! ఊఁ. సరే తప్పుతుందా!" అంటూ చిర్నవ్వుతో పాకెట్ అందించాడు. పాకెట్ అందుకుంటూంటే_ ఎవరి మేతో తింటున్న ఏనుగు నా ప్రయాణాలకోసం మా ఇంటి ముందు బిచాణా వేసినంత ఆనందం కలిగింది! బిల్లు చెల్లించి రోడ్డుమీద పడ్డాను.

హమ్మయ్య ఎలాగయితేనేం చీర దొరికింది. ఈ చీరని చూసి పాలల్లా పొంగి పోతుందేమో శాంత.

సూర్యుడు చల్లగా ఉన్నాడు. ఆనందంగా ఉన్నాడు.

ఆప్యాయంగా పాకెట్ గుండెలకి హత్తుకుని చురుగ్గా నడుస్తున్నాను. తియ్యటి ఊహాల్ని పీల్చుకుంటున్నాను.

హఠాత్తుగా ఎవరిదో కేక వినబడింది. తుళ్ళిపడ్డాను. నా ఎదురుగా ఓ మిఠాయి బండి ఆగివుంది.

"ఏటండీ_ గంటనిపించుకోరు, తప్పుకోరు! కాంత సూసుకోండి ఏ లారీ కిందేనా పడగల్రు." అంటూ కసురుకున్నాడు మిఠాయి బండివాడు.

చటుక్కున జేబులోంచి అయిదు రూపాయల కాయితంతీసి బండివాడి చేతిలోపెట్టాను. వాడు బూడిదకుప్పలా నోరెల్లబెట్టాడు.

"ఈవేళ చేసిన తీపిసరుకు అయిదు రూపాయలపొడుక్కి_ పార్సిల్ చెయ్యి." అన్నాను.

"అదా! హుహు హు... సంపేశారండీ బాబూ...?" అంటూ పప్పు ఎనుపు తిన్నట్టుగా ఓ పావుగంట నవ్విన బండివాడు పొట్లాం అందించాడు.

ఆలోచనల్ని జేబులోదాచేసి వేగంగా ఇల్లు చేరుకున్నాను.

"నాన్నొచ్చాడోయ్_ నాన్నొచ్చాడోయ్." అంటూ పిల్లలు ఎగబడ్డారు. పొట్లాం విప్పి తలో రెండు మిఠాయిలూ పెట్టాను. వాళ్ళు తింటూ పరిగెత్తుకు వెళ్ళిపోయారు.

శాంత లోపల వంట పనిలో వుంది కాబోలు. కాస్సేపు ఆడిద్దాం. బోను మరి! ఇంత కష్టపడి తెచ్చిన చీర ఏ గడబిడా లేకుండా చేతిలో పడితే_ 'ఓస్ ఇంతేనా! ఉల్లిపాయలేని కందిపొడుంలా వుంది!' అంటుదేమో! చీర పాకెట్ ఓ వార్న దాచేశాను.

"శాంతా_శాంతా! ఇలారా ఓసారి."

"వస్తున్నా." అంటూ అరిచి, కాస్సేపటికి అంటగరిటతో ప్రత్యక్షమైంది శాంత. రాగానే నన్ను చూస్తూ అంది_ "ఏవిఁటండోయ్_ఇంగువచారులా ఈ వేళ మీ మొహం ఘుమఘుమలాడిపోతూంది!" అని.

"అప్పుడే కనిపెట్టేశావన్నమాట! నీకేం తెచ్చానో చెప్పుకో." అన్నాను ఊరిస్తూ.

"పేద్ద! చెప్పుకోలేనా ఏవిఁటి! ఏ మల్లెపూలో, బరాణీలో తెచ్చుంటారు."

"ఏయ్_ కాదు కాదు."

"అబ్బ చెబుదురూ_ అవతల అన్నం వార్చుకొచ్చింది."

ఇలా మేవిఁద్దరం మాట్లాడుకుంటూ అన్నీ మరిచిపోయి గంటలకొద్దీ గడిపెయ్యగలం!...

కాస్సేపు ఊరించి అసలు విషయం చెప్పాను—"నీ పుట్టినరోజునాటి వాగ్దానం తీర్చుకున్నాను శాంతా" అన్నాను గర్వంగా కాదు ప్రేమగా

"అయ్యో- నిజంగానే తెచ్చారా! ఇప్పుడెందుకండీ నాకు చీర ఆడబ్బుంటే ఈ నెల్లో చంటాడి పాలడబ్బా ఖర్చు ఎత్తుకుపోనుకదా ఇచ్చెయ్యండి కొట్టువాడికి" అంది నొచ్చుకుంటూ

"ఇదేం పైత్యం! చక్కగా కొత్త చీర కట్టుకుని నాతో సినిమాకి వస్తావనుకుంటే, చీరే వద్దంటావేం ఖర్మ!"

"అసలే అంతంతమాత్రం జివితాలు కదా- ఇలా దూబరా చేస్తే ఎలాగండీ!"

"ఫరవాలేదులే- మిగిలిన డబ్బు మన అవసరాలకి సరిపెట్టుకోవచ్చు కాకపోతే కిరానాకొట్లో మరికాస్త అరువు పెరుగుతుందంతేగా"

"ఒద్దండి- ఆ అరువుమాత్రం ఎంగుకు? నా మాట విని చీర తిరిగి ఇచ్చెయ్యండి" అంటూ బ్రతిమాలింది

"వీల్లేదంటే వీల్లేదు" అన్నాను ఖచ్చితంగా పాకెట్ తెచ్చి చకచకా విప్పాను "ఇది నువ్వు కట్టుకు తీరాలి" అని పట్టుబట్టాను

పైకి ఊరికే ఒద్దంటుందిగాని, మంచి బట్టలు, టాయిలెట్ సామాన్లు, భర్తతో షికార్లు- లోలోపల ఉండకుండా ఉంటాయా! ఈ విషయం చాలాకాలం క్రితమే గ్రహించాను గాని ఆమె కోర్కెలు తీర్చే ఎత్తుకు మాత్రం ఎదగలేకపోతున్నాను

శాంత మౌనంగా చీర వెంపు చూస్తూంది

"తీసుకో శాంతా- నా ఉత్సాహాన్ని చంపకు" అంటూ గెడ్డం పట్టుకున్నాను

చాలాసేపటి తరవాత ఎలాగైతేనేం ఒప్పుకుంది ఆనందంతో పొంగిపోయాను ఏదో ఘనకార్యం చేశాననిగాని, దేశానికేదో మేలుచేశాననిగానీ కాదు, చాలా రోజులుగా డబ్బుకోసం ఎదురుచూసి- ఎన్నో కొట్లు తిరిగి తిరిగి కొన్న చీర- ఇది మళ్ళీ కొట్లోకే వెళ్ళకుండా శాంత ఒంటిమీద, ఉంగరంలో పొడిలా మెరిసిపోవడంకన్న నాకింకేం కావాలి

"ఎలావుంది చీర?" అడిగాను ఏ ఉపమానం చెపుతుందా అనుకుంటూ

"చాలా బాగుందండీ- బంగాళదుంపల వేపుడు రుచిలా వుంది" అని మెచ్చుకుంటూ చీర పరీక్షించసాగింది




గారెలు తిన్నంత సంతోషంగా వుంది నాకు. ఈ చీరలో శాంతని ఊహించుకుంటున్నాను.

"ఎన్ని మూరలుందో చూద్దాం పట్టుకోండి." అంటూ చీరమడతలన్నీ విప్పింది. ఓ కొస నేను పట్టుకున్నాను. అట్నించి కొలుస్తోంది శాంత. "ఒకటీ, రెండూ, మూడూ, నాలు..." మధ్యలో ఎందుకో ఆగిపోయింది.

"అయయ్యో ఇదేం చీరండీ!" అంటూ అరిచింది.

ఆ కేక విని హడలిపోయాను. "ఏవైందేవైంది?" అన్నాను కంగారుగా.

"చూడండి! దీనికి నా తలకాయంత చిల్లుంది. ఎవడంటగట్టాడో గాని చూసుకోవొద్దుటండీ."

నాగుండె గతుక్కుమంది. విశ్వరూపం దాల్చిన కండచీమలాగ చీరకివున్న కన్నం నన్ను వెక్కిరిస్తోంది. చాలాసేపు శాంత ఏం మాట్లాడిందో నాకు తెలియలేదు.

"...ఆ కొట్టువాడికి నాలుగు చీవాట్లు వేసి చీర ఇచ్చేసిరండి. లేకపోతే మరో చీర ఇమ్మనండి" అన్న వాక్యంమాత్రం నా చెవిలోకి ఎక్కింది.

చీర లుంగచుట్టి చేతి సంచీలో పెట్టుకున్నాను. రివ్వున వీధిలోకి పరిగెత్తాను!

... ... ...

బజార్లో...బట్టల కొట్లో...

"...అబ్బే—పుచ్చుకోంసార్. ఇలా అడక్కడం మీకు మర్యాదకాదు" కొట్టువాడు ఖండితంగా అన్నాడు.

"పోనీ అయిదు రూపాయిలుతగ్గించి తీసుకొని మరోచీర యివ్వండి" అన్నాను

"కుదరండీ_కుదరదు! ఇలా నలిపేశారు పైగా. వెళ్ళిరండి."

"అహఁ. అలా అంటే కాదు. చూడండి..."

"చూసేదేవిఁటండీ! మేవేంజెయ్యం! కొనేముందే బాగా చూసుకోవాలి."

"అది నిజవేఁ అనుకోండి. కాని..."

"కానీలేదు, పైసాలేదు. ఏవండోయ్ ఇలా అమ్మినవన్నీ తిరిగొస్తే మేం యాపారం చేసినట్టే. వెళ్ళిరండి మా బేరాలకడ్డు" అంటూ గుడ్లెర్రజేశాడు కొట్టువాడు.

కోపం గొంతునిండా వచ్చింది నాకు. బడబడా అరిచాను. అయినా కొట్టువాడు లక్ష్యపెట్టలేదు. చాలాసేపు కొట్టుకున్నంతపనిచేశాం. చుట్టూ వినోదంగా సినిమా చూస్తున్నట్టు జనం పోగయ్యారు. ఇంక అసహ్యంగా ఉంటుందని నన్ను నేను తమాయించుకున్నాను. చీర వాడి మొహాన్నే కొడదాఁవనుకున్నాను. కాని అంతడబ్బూ పోసి కొన్నచీర వాడికే దానం చెయ్యడానికి మనసొప్పలేదు. విసవిసా ఇవతలికి వచ్చాను. పొడుగాటి గతుకురోడ్డు వెర్రిగా చేతులు సాచింది.

ఛ వెధవ జీవితం. ఆశల్ని ఎప్పటికప్పుడు మింగుతున్న నాగుబాము. చీరను తల్చుకుంటే ఏడుపొస్తోంది. నేను చేసిన వాగ్దానం బ్రద్దలయింది. ఇప్పుడు శాంతకి ఎలా మొహం చూపించను?...

కాళ్లు నీరసంగా నడుస్తున్నాయి!... వీధులన్నీ తిరిగి తిరిగి ఇంటికి చేరుకున్నాను.

శాంత నాకోసం ఎదురుచూస్తూ గుమ్మంలో నించుంది నన్ను చూడగానే

"ఏం అలా వున్నారు?" అని అడిగింది.

బరువుగా నిట్టూర్చాను. జరిగినదంతా చెప్పాను.

శాంత మౌనంగా ఎటో చూస్తూంది.

"శాంతా! ఈ చీర కట్టుకోడానికి పనికిరాకపోయినా, నీకో అరడజను జాకెట్లు, పిల్లలకి నాలుగేసి లాగులు, నాకో లుంగీ..." దుఃఖంతో గొంతు బొంగురుపోయింది. నవ్వాను_నవ్వాలని కాదు_నవ్వు రానూ లేదు.

శాంత మాట్లాడలేదు.

"నీకు చేసిన వాగ్దానం నిలబెట్టుకోలేకపోయాను శాంతా. నా కోరిక ఇలా రూపాంతరం చెంది అణువులుగా మారిపోతుందని అనుకోలేదు. నిన్ను ఆశపెట్టి అంతలోనే నిప్పులతో కొట్టాను. క్షమించు" అన్నాను. నా గుండెలో నీళ్ళు మరుగుతున్నాయి. ఈ నెలలో మరో ముప్ఫై రూపాయలు చీరకోసం ఖర్చుపెట్టి, కుటుంబసమేతంగా పదిరోజుల పాటు పస్తులు పడుకోలేని నిస్సహాయత, నా కళ్ళని తడితడిగా చేస్తూంది.

ఆఖరికి___"ఈ వేళ కూర మాడిపోయిందండి" అని మాత్రం అంది శాంత___ఒణికే గొంతుతో.

ఇప్పుడు కూరగొడవ ఎందుకో నాకు అర్థంకాలేదు. అర్థమయ్యేసరికి శాంత అక్కడ లేదు.

కిటికీలోంచి గదిలోకి ఉరుకుతున్న సాయం సూర్యుడు చాలా వేడిగా ఉన్నాడు. లావాలా కెరటాలు వేస్తున్నాడు.

★

---

## పొంగితే....

—సుభాష్ చంద్ర

చివికి చిల్లులుపడ్డ జీవితాలకు
మాయమాట్ల-మాట్లు వేయకండి-
భగ్గుమనే హృదయాలపై
నీవు కప్పే శాంతివచనాల రగ్గు ఆగుతుందా-
గట్లు పొరుసుకు ప్రవహించే మనుష్య నదులకు;
కాంక్రీటు లేని కాంట్రాక్టరు అధికారం గట్లు
ఎన్నాళ్లు నిలుస్తాయి-
మానవాళి జలపాతం
దూకి దూకి
ఏరులై
నదులై
సముద్రాలై
ఉప్పొంగి, పొంగి, పొరలి. ...